## క్లుప్తంగా

### శివాజీ విగ్రహ ఏర్పాటుకు సహకరించండి



ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డిని సన్మానించిన సభ్యులు

దోమ: బొంపల్లి గ్రామంలో ఏర్పాటు చేస్తున్న శివాజీ విగ్రహ ఏర్పాటుకు సహకరించాలని పరిగి ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డిని శివాజీ యూత్ సభ్యులు కోరారు. గురువారం పరిగి పట్టణంలోని ఎమ్మెల్యే నివాసంలో ఆయనను శివాజీ యూత్ సభ్యులు కలిశారు. శివాజీ ఆశయ సాధనకు కృషి చేసేందుకు గ్రామంలో విగ్రహాన్ని ఏర్పాటు చేస్తున్నామని తమ వంతు సహాయాన్ని అందించాలని విజ్ఞప్తి చేశారు. సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే తప్పకుండా సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. బొంపల్లి శివాజీ యూత్ సభ్యులు రమేశ్, కుర్వ రమేశ్, రాములు, నర్సింహ, పెంటయ్య, యాదగిరి, యాదయ్య, డీ.యాదయ్య, బీ. యాదయ్య పాల్గొన్నారు.

### సమస్యల పరిష్కారానికే ‘డయల్ యువర్ చైర్‌పర్సన్’



మొబైల్ ద్వారా ఫిర్యాదులు తీసుకుంటున్న చైర్‌పర్సన్ మంజుల

వికారాబాద్ అర్బన్: డయల్ యువర్ చైర్‌పర్సన్ కార్యక్రమంతో పట్టణ ప్రజలకు మరింత చేరువవ్వడంతో పాటు, సమస్యలు పరిష్కరించేందుకు అవకాశం కలుగుతుందని మున్సిపల్ చైర్‌పర్సన్ మంజులరమేశ్ అన్నారు. గురువారం నిర్వహించిన ఫోన్ ఇన్ ద్వారా 14 ఫిర్యాదులు వచ్చాయని తెలిపారు. గత వారం వచ్చిన 21 ఫిర్యాదుల్లో ఆరింటికి శాశ్వత పరిష్కారం చూపామన్నారు. మరో రెండు ఫిర్యాదులు ఎక్కువ నిధులతో కూడుకున్నవని, మిగతా సమస్యలను సైతం దశలవారీగా పరిష్కరిస్తామని చెప్పారు. ప్రధానంగా డ్రైనేజీ, వీధి కుక్కలు, స్ట్రీట్ లైట్లకు సంబంధించిన ఫిర్యాదులు వస్తున్నాయని తెలిపారు. వీలైనంత త్వరగా వీటిని పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

### వంట సరుకుల వితరణ



సరుకులు అందజేస్తున్న సర్పంచ్ శివిబాయి

కుల్కచర్ల: ప్రజలకు ఎల్లప్పుడూ అండగా ఉంటూ సేవలు అందిస్తామని అల్లాపూర్ సర్పంచ్ శివిబాయి అన్నారు. గ్రామానికి చెందిన బాబ్య నీలిబాయి కూతురు శోభ వివాహానికి అవసరమైన బియ్యం, మంచినూనె, కారంపొడి తదితర వంట సామగ్రిని పెళ్లి కానుకగా అందించారు.

### మధ్యాహ్న భోజనం పరిశీలన

దౌల్తాబాద్: పాఠశాలల్లో మధ్యాహ్న భోజనాన్ని నాణ్యతగా అందించాలని మధ్యాహ్న భోజన మానిటరింగ్ కమిటీ డీఆర్‌పీ నరేష్ తెలిపారు. మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో గురువారం మధ్యాహ్న భోజన పథకం అమలుపై సామాజిక తనిఖీ, స్కూల్ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలోని మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో సర్పంచ్ శిరీష, హెచ్‌ఎం ఊషన్న, ఎస్‌ఎంసీ కమిటీ సభ్యులు ఉన్నారు.

### వికారాబాద్‌లో జియోఫైబర్ సేవలు

అనంతగిరి: వినియోగదారులకు నాణ్యమైన మొబైల్ సేవలు అందించాలని ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ అన్నారు. వికారాబాద్ ఇంద్రానగర్‌లో జియో ఫైబర్ సేవలను గురువారం ఆయన ప్రారంభించారు. వినియోగదారులకు మెరుగైన సేవలు అందిస్తేనే మంచి పేరు వస్తుందన్నారు. వికారాబాద్ అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతోందన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ వైస్ చైర్మన్ మేక శేఖర్‌రెడ్డి, మాజీ కౌన్సిలర్ శ్రీనివాస్, నాయకులు శ్రీనివాస్‌గౌడ్, శేఖర్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

### ఆరోగ్య సమస్యల బారిన పడొద్దు

కుల్కచర్ల: పరీక్షల సమయంలో ఆరోగ్య సమస్యల బారిన పడొద్దని మండల వైద్యాధికారి వాజుద్దీన్ అన్నారు. కస్తూర్బాగాంధి బాలికల ఆశ్రమ పాఠశాలలో గురువారం వైద్య శిబిరం నిర్వహించి, పరీక్షల సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఈ కేజీబీవీ ప్రత్యేకాధికారి దేవి, మెడికల్ అసిస్టెంట్ వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

### కంటివెలుగు శిబిరం ప్రారంభం

పరిగి: కంటి వెలుగు పథకం దేశానికే ఆదర్శమని మున్సిపల్ చైర్మన్ ముకుందఅశోక్‌కుమార్ సూచించారు. పట్టణ కేంద్రంలోని 8వ వార్డులో గురువారం కంటి వెలుగు శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. అవసరమైన వారికి కళ్లద్దాలు పంపిణీ చేస్తామన్నారు. కంటి ఆ ఆపరేషన్లు సైతం చేస్తామన్నారు. సద్వినియోగం చేసుకోవాలన్నారు. నాయకులు మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

# లక్ష్యం దిశగా అడుగులు

- 21 రోజుల్లో ముగియనున్న ఆర్థిక సంవత్సరం
- మండలంలో ఇప్పటివరకు 86 శాతం మేర పన్నుల వసూలు
- టార్గెట్ చేరుకుంటామంటున్న అధికారులు



కుల్కచర్ల గ్రామ పంచాయతీ కార్యాలయం

కుల్కచర్ల: మండల పరిధిలోని ఆయా గ్రామాల్లో వందశాతం పన్నులు వసూలు చేయడమే లక్ష్యంగా పంచాయతీ కార్యదర్శులు పనిచేస్తున్నారు. ఆర్థిక సంవత్సరంలో 20రోజులు మాత్రమే మిగిలి ఉండటంతో ఇంటింటా తిరిగి పన్నులు వసూలు చేస్తున్నారు. జిల్లాలో పన్నుల వసూళ్లలో కుల్కచర్ల మండలం ముందంజలో ఉంది. గత సంవత్సరం వందశాతం (రూ.42,54,431) ట్యాక్స్ వసూలు చేసిన మండలంగా కుల్కచర్ల నిలిచింది. ఈ ఆర్థిక సంవత్సరంలో రూ.44,78,348 లక్ష్యంగా పన్నుల వసూలు ప్రక్రియను ప్రారంభించిన మండల అధికారులు అందుకు అనుగుణంగా గ్రామాల్లో పన్నులను వసూలు చేస్తున్నారు. ప్రస్తుతం కుల్కచర్ల మండలం రూ.38,52,670 వసూలు చేసి 86.03 శాతాన్ని సాధించింది.

**ముంచుకొస్తున్న గడువు..**

ప్రస్తుత ఆర్థిక సంవత్సరం పూర్తికావడానికి మరో 20రోజులు మాత్రమే మిగిలి ఉండటంతో అధికారులు వందశాతం పన్నుల వసూలుపై దృష్టి సారించారు. సెలవులు పోనూ మొత్తంగా 15రోజులు మాత్రమే పన్నులు వసూలు చేసేందుకు అవకాశం ఉంది. వందశాతం చేరుకునేందుకు రూ.6,25,678 వసూలు చేయాల్సి ఉంది. కొన్ని గ్రామాల్లో తక్కువగా పన్నులు వసూలు చేస్తుండటంతో జిల్లా అధికారుల ఆదేశానుసారం త్వరితగతిన ట్యాక్స్ వసూలు చేయాలని మండల అధికారులు క్షేత్రస్థాయిలో అధికారులకు, ప్రజాప్రతినిధులకు సూచనలు చేస్తున్నారు.

**పెరగనున్న ఆదాయం..**

నిధుల లేమితో ఇబ్బందులకు గురౌతున్న గ్రామ పంచాయతీల్లో కనీసం పన్నులతోనైనా కొంత ఊరట పొందాలని చూస్తున్నారు ప్రజాప్రతినిధులు. ప్రస్తుతం పన్నుల వసూలు కార్యక్రమాల్లో సర్పంచులు సైతం పాల్గొని అధికారులకు సహకరిస్తున్నారు. పన్నుల వసూళ్లతో వచ్చే ఆదాయంతో కొంతైనా ఇబ్బంది తీరుతుందని ప్రజాప్రతినిధులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

**“ నిరంతరం పర్యవేక్షణ చేస్తున్నాం**



పన్నుల వసూళ్ల కార్యక్రమంలో క్షేత్రస్థాయి అధికారులతో నిరంతరం పర్యవేక్షణ చేస్తున్నాం. పంచాయతీ కార్యదర్శులు వారి వారి గ్రామాల్లో ప్రజాప్రతినిధుల సహకారంతో వందశాతం ట్యాక్స్ వసూలు చేసేందుకు కార్యదర్శులకు సూచనలు చేస్తున్నాం. ప్రతి గ్రామపంచాయతీ వందశాతం పన్నులు వసూలు చేసేలా నిరంతరం పర్యవేక్షిస్తున్నాం. వారికి అవసరమైన సహాయం అందిస్తున్నాం.

– కరీం, ఎంపీఓ, కుల్కచర్ల

# మహిళలు అన్నిరంగాల్లో రాణించాలి

**ఆర్టీసీ డీఎం సమత**



కేక్ కట్ చేస్తున్న ఆర్టీసీ డీఎం సమత

తాండూరు టౌన్: మహిళలు అన్ని రంగాలలో రాణించాలని ఆర్టీసీ డీఎం సమత అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవ వారోత్సవాలను పురస్కరించుకుని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. పురుషులకు దీటుగా ఏ రంగంలోనైనా రాణించే సత్తా మహిళలకు ఉందన్నారు. మహిళలు ఉన్నతంగా ఎదగాలంటే ఉన్నత చదువులు చదవాలన్నారు. అలాగే తమ చుట్టూ ఉన్న ప్రమాదాల పట్ల ఎల్లప్పుడూ జాగ్రత్తగా ఉండాలన్నారు. విద్యార్థినిలు సెల్‌ఫోన్ మాయలో పడి జీవితాలను వ్యర్థం చేసుకుంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. అలాంటి వాటికి దూరంగా ఉండటంతో పాటు అనుకున్న లక్ష్యాన్ని చేరేందుకు తీవ్ర కృషి చేయాలన్నారు. ఈ సందర్భంగా ఆమె కళాశాల అధ్యాపకులు, విద్యార్థినులతో కలిసి ఆవరణలో మొక్కలు నాటారు. అనంతరం కేక్ కట్ చేసి సంబరాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రవీందర్, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

తాండూరు టౌన్: ఏఐటీయూసీ ఆధ్వర్యంలో స్థానిక పాత మున్సిపల్ కార్యాలయం ఆవరణలో గురువారం శ్రామిక మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా మహిళా అధ్యక్ష, కార్యదర్శులు పుణ్యవతి, విజయలక్ష్మి పండిట్ హాజరై మహిళా కార్మికులను ఘనంగా సన్మానించారు. కృషి, పట్టుదల, పోరాట పటిమ ఉంటే ఏరంగంలో నైనా మహిళలు రాణిస్తారన్నారు. ప్రపంచంలో మహిళల భాగస్వామ్యం లేకుండా ఏరంగం అభివృద్ధి చెందలేదన్నారు. మహిళా కార్మికుల శ్రమ వెలకట్టలేనిదని ఆమె కొనియాడారు. ఈ కార్యక్రమంలో పలువురు మహిళా కార్మికులు, జిల్లా కార్యదర్శి గోపాల్, మున్సిపల్ యూనియన్ అధ్యక్షులు వీరేశం, కార్యదర్శి భూపతి పాల్గొన్నారు.

**ఎంపీడీఓ కార్యాలయంలో..**

కుల్కచర్ల: ఒక ఇల్లు అభివృద్ధి పథంలో ముందుకు సాగాలంటే మహిళలే కీలకమని కుల్కచర్ల ఎంపీపీ సత్యమ్మ అన్నారు. కుల్కచర్ల మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో గురువారం మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మండల పరిధిలో వివిధ శాఖల్లో విధులు నిర్వహిస్తున్న మహిళలను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మహిళా ఉద్యోగులు దేవి, అపర్ణ, మండల పరిషత్ సిబ్బంది పాల్గొన్నారు.

# లక్ష్యం చేరుకునేవరకు విశ్రమించొద్దు




సీనియర్ అధ్యాపకులను సన్మానించిన ఉపాధ్యాయులు

**సిద్దార్థ కళాశాల ప్రిన్సిపాల్ కృష్ణారెడ్డి**

అనంతగిరి: విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సిద్దార్థ కళాశాల ప్రిన్సిపాల్ కృష్ణారెడ్డి అన్నారు. వికారాబాద్‌లోని సిద్దార్థ జూనియర్ కళాశాలలో సీనియర్ ఇంటర్ విద్యార్థుల వీడ్కోలు సమావేశం గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. ఇంటర్ విద్య ఎంతో కీలకమైందన్నారు. ఈ దశ నుంచే మన భవిష్యత్‌ను నిర్దేశించుకోవచ్చన్నారు. లక్ష్యాన్ని సాధించే వరకు విశ్రమించవద్దన్నారు. అందుకు అధ్యాపకులుగా మా సహకారం ఎల్లవేళలా ఉంటుందన్నారు. విద్యార్థులు బాగా చదివి మంచి స్థాయిలో స్థిరపడాలని ఆకాంక్షించారు. అనంతరం కళాశాలలో 25 సంవత్సరాలుగా బోధిస్తున్న శివారెడ్డి, ప్రతాప్ రెడ్డిని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో డైరక్టర్లు భద్రీనాథ్, వేణుగోపాల్, అధ్యాపకులు రవీందర్‌రెడ్డి రాఘువేందర్‌రెడ్డి, రామాంజనేయులు, రాములు, నర్సింహారెడ్డి, సురేష్, సైదులు, ప్రవీణ్ మహేందర్, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

# ఎన్‌ఎంఎంఎస్ ద్వారానే హాజరు

**ఏపీఓ శంకర్**



ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న ఏపీఓ శంకర్

మోమిన్‌పేట: ఉపాధి కూలీలకు ఎన్‌ఎంఎంఎస్ (నేషనల్ మొబైల్ మానిటరింగ్ సిస్టం) ద్వారానే హాజరు వేయడం జరుగుతుందని ఏపీఓ శంకర్ పేర్కొన్నారు. మండల పరిధిలోని ఎన్కేపల్లిలో గురువారం ఉపాధి కూలీలతో ఆయన మాట్లాడారు. నూతనంగా కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన ఎన్‌ఎంఎంఎస్ పద్ధతి ద్వారానే కూలీల హాజరువేయబడుతుందన్నారు. దాని ఆధారంగానే కూలీ డబ్బులు జమ అవుతాయని ఆయన తెలిపారు. గతంలో మస్టర్‌లో కూలీల సంతకాల ద్వారా హాజరు వేసే వారని ప్రస్తుతం ఫీల్డ్ అసిస్టెంటు మొబైల్‌తో కూలీ పేరును సేవ్ చేసి అప్‌లోడ్ చేయాల్సి ఉంటుందన్నారు. అలా చేసే క్రమంలో ఒక్కోసారి సర్వర్ ప్రాబ్లం వచ్చినా, ఫోన్ సమస్య, ఇంటర్‌నెట్ సమస్య వచ్చిన హాజరు గల్లంతేనని ఆయన పేర్కొన్నారు. కూలీలు ఈ విషయాన్ని గ్రహించి ఎన్‌ఆర్‌ఈజీఎస్ సిబ్బందికి సహకరించాలని ఆయన కోరారు. ప్రతి కూలీ నిబంధనల మేరకు పనులు చేస్తేనే పూర్తి కూలీ డబ్బులు వస్తాయని ఆయన సూచించారు. సమయపాలన పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్ అడివిరెడ్డి, కూలీలు ఉన్నారు.

### నేడు ఉపాధ్యాయ ఆత్మీయ సమ్మేళనం

తాండూరు టౌన్: ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం (తపస్) అభ్యర్థి ఏవీఎన్ రెడ్డికి మద్దతుగా బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాణీరుద్రమ శుక్రవారం తాండూరుకు రానున్నారు. స్థానిక తులసీ గార్డెన్ ఫంక్షన్ హాల్‌లో సాయంత్రం 5.30 గంటలకు జరుగనున్న ఉపాధ్యాయ, అధ్యాపక బృందంతో జరుగనున్న ఆత్మీయ సమ్మేళనంలో ఆమె పాల్గొంటారని మండల శాఖ అధ్యక్షుడు శ్రీనివాస్, జిల్లా మీడియా ఇన్‌చార్జి గాజుల బస్వరాజ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి తపస్ రాష్ట్ర అధ్యక్షుడు హన్మంతరావు కూడా హాజరు కానున్నారని.. ఉపాధ్యాయులు పెద్ద ఎత్తున సమ్మేళనానికి తరలిరావాలని తాండూరు కోరారు.

### అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులు షురూ

తాండూరు రూరల్: మండల పరిధిలోని అంతారంతండాలో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణ పనులను జెడ్పీటీసీ గౌడి మంజుల గురువారం ప్రారంభించారు. 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.5 లక్షలతో తండాలో మురుగు కాల్వలు, సీసీరోడ్లు నిర్మిస్తామని తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం తండాల అభివృద్ధికి కృషి చేస్తోందని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ గౌడి వెంకటేశం, నాయకులు రాంచందర్ తదితరులు ఉన్నారు.

### పీఆర్టీయూతోనే ఉపాధ్యాయ సమస్యల పరిష్కారం

**మండల అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి**

యాలాల: ఉపాధ్యాయ సమస్యలు పరిష్కారం కావాలంటే పీఆర్‌టీయూ టీఎస్ ఎమ్మెల్సీ అభ్యర్థి గుర్రం చెన్నకేశవరెడ్డిని గెలిపించాలని ఆ సంఘం మండల అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి అన్నారు. గురువారం మండల పరిధిలోని యాలాల, ముద్దాయిపేట, కోకట్, టీఎస్‌డబ్ల్యూఆర్‌ఎస్, అగ్గనూరు తదితర పాఠశాలల్లో ప్రచారం నిర్వహించి ఓటరు స్లిప్పులను పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రైవేటు సంస్థల యాజమాన్య అభ్యర్థికి, ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి కృషిచేసే అభ్యర్థికి మధ్య ఈ పోటీ ఉందన్నారు. ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి కృషి చేసే తమ సంఘ అభ్యర్థి గుర్రం చెన్నకేశవరెడ్డికి మద్దతుగా ఎన్నికల్లో ఓటు వేసి గెలిపించాలన్నారు. మార్చి 13న జరిగే ఎన్నికల్లో వరుస సంఖ్య 11లో గల చెన్నకేశవరెడ్డి పేరు ఎదుట మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలన్నారు. ఈ కార్యక్రమంలో పీఆర్‌టీయూ జిల్లా గౌరవ అధ్యక్షుడు వెంకట్‌రాంరెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి యాదయ్యగౌడ్, ఉపాధ్యాయులు తదితరులు ఉన్నారు.

# గ్రామాల్లో సీసీ రోడ్డు పనులు ప్రారంభం



రోడ్డు పనులను ప్రారంభిస్తున్న సర్పంచ్ శ్రవణ్

పెద్దేముల్: మంబాపూర్ గ్రామాభివృద్ధికి కృషి చేస్తానని సర్పంచ్ శ్రవణ్‌కుమార్ అన్నారు. ఎన్‌ఆర్ ఈజీఎస్ నిధులు రూ.4 లక్షలతో గ్రామంలో సీసీ రోడ్డు నిర్మాణ పనులను గురువారం ఆయన ప్రారంభించారు. ఎమ్మెల్యే పైలెట్ రోహిత్‌రెడ్డి సహకారంతో గ్రామాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి సంజీవ్, వార్డు సభ్యులు కిరణ్, మోహిద్, నాయకులు వెంకటయ్య, అశోక్ ఉన్నారు.

**కట్టెపహాడ్ తండాలో..**

మర్పల్లి: మండల పరిధిలోని పట్లూర్ గ్రామ పంచాయతీ అనుబంధ గ్రామమైన కట్టెపహాడ్ గిరిజన తండాలో ఉపాధి హామీ పథకం కింద మంజూరైన రూ.10 లక్షలతో తండాలో సీసీ రోడ్డు పనులను గ్రామ సర్పంచ్ ఇందిర గురువారం ప్రారంభించారు. మరిన్ని నిధులకు కృషిచేసి తండాలో అభివృద్ధి పనులు చేపడతామని సర్పంచ్ తెలిపారు. కార్యక్రమంలో నేతలు పలికారు.

### ఏవీఎన్‌రెడ్డిని గెలిపించండి

**బీజేపీ పట్టణ ఇన్‌చార్జి శివప్రసాద్**



శ్రీ సాయినగర్‌లో ప్రచారం నిర్వహిస్తున్న బీజేపీ నేతలు

వికారాబాద్ అర్బన్: శాసన మండలిలో ప్రశ్నించే గళాన్ని గెలిపించాలని బీజేపీ పట్టణ ఇన్‌చార్జి మరాఠి శివప్రసాద్ కోరారు. గురువారం సాకేత్ నగర్, కమలానగర్, శ్రీ సాయినగర్, ఎన్నెపల్లిలో బీజేపీ ఎమ్మెల్సీ అభ్యర్థి తరపున ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉపాధ్యాయులకు ఇవ్వాల్సిన డీఏలు, పీఆర్‌సీ వంటివి నిబంధనల మేరకు ఇవ్వడం లేదన్నారు. కేవలం ఎన్నికలు వచ్చినప్పుడు మాత్రమే ఉపాధ్యాయులను, మేధావులను మభ్య పెట్టేందుకు డీఏలు, పీఆర్‌సీలు ఇస్తామని చెబుతున్నట్లు తెలిపారు. ఉపాధ్యాయ బదిలీల్లో పారదర్శకత లోపించడంతో అనేక మంది న్యాయం కోసం కోర్టుకు పోతున్నట్లు తెలిపారు. ఉపాధ్యాయులకు మేలు జరగాలంటే తప్పకుండా బీజేపీ బలపర్చిన ఏవీఎన్ రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలన్నారు. బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

**తాండూర్ రూరల్ పరధిలో..**

తాండూరు రూరల్: ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ బలపర్చిన అభ్యర్థి ఏవీఎన్ రెడ్డిని గెలిపించాలని ఆ పార్టీ మండల అధ్యక్షు డు ఆంజనేయులు కోరారు. గురువారం మండల పరిధిలోని చెంగోల్, జినుగుర్తి, బెల్కటూర్, కరన్‌కోట్ ఉన్నత పాఠశాలల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మొదటి ప్రాధాన్యత ఓటు వేసి ఏవీఎన్ రెడ్డిని గెలిపించాలని కోరారు. పార్టీ అధికార ప్రతినిధి విజయ్‌కుమార్, జిల్లా కిసాన్‌మోర్చా ఉపాధ్యక్షులు సంజీవ్‌రెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి విజయ్, కిసాన్ మోర్చా మండల అధ్యక్షుడు సూర్యకుమార్ పాల్గొన్నారు.

### 11, 12 తేదీల్లో షిరిడీసాయి వార్షికోత్సవం

పరిగి: ఈనెల 11, 12 తేదీల్లో పరిగి మందిరంలోని శ్రీ షిరిడీసాయిబాబా వార్షికోత్సవాలను నిర్వహించనున్నట్టు నిర్వాహకులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం సాయి బాబా ఊరేగింపు, అఖండ సాయినామ సంకీర్తన, ఆదివారం స్వామివారి కాకడ హారతి, సామూహిక వ్రతాలు, పూజా కార్యక్రమాలను నిర్వహించనున్నట్టు తెలిపారు. అన్నదాన కార్యక్రాలు, సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహిస్తామన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

# కొనసాగుతున్న బ్రహ్మోత్సవాలు



పల్లకీ సేవలో ఎమ్మెల్యే మహేశ్ రెడ్డి

దోమ: మైలారం గ్రామంలో వెలసిన శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి వార్షికోత్సవ వేడుకలు వైభవంగా జరుగుతున్నాయి. గురువారం పరిగి ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి ఉత్సవాల్లో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. శ్రీవారి పల్లకీ సేవను మోశారు. జెడ్పీటీసీ నాగిరెడ్డి, కుల్కచర్ల ఎంపీపీ సత్యమ్మ, వైస్ ఎంపీపీ మల్లేశం, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు గోపాల్ గౌడ్, ఉపసర్పంచ్ నర్సింహులు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఆంజనేయులు, డీసీసీ ప్రధానకార్యదర్శి హన్మంతు, దేవాలయ నిర్మాణకర్త రాములు, ఏంఈఓ హరిశ్చందర్, భక్తులు పాల్గొన్నారు.

# ఆర్థికసాయం అందజేత

**అంత్యక్రియలకు సాయం అందజేత..**

తాండూరు రూరల్: మండల పరిధిలోని మల్కాపూర్ గ్రామానికి చెందిన అల్లాపూర్ వెంకటమ్మ గురువారం అనారోగ్యంతో మృతి చెందింది. విషయం తెలుసుకున్న బీఆర్‌ఎస్ మండల బీసీసెల్ అధ్యక్షుడు రావులపల్లి చంద్రశేఖర్‌గౌడ్ (ఆర్సీ).. వెంకటమ్మ అంత్యక్రియల నిమిత్తం ఆమె కుటుంబ సభ్యులకు రూ.3500 అందజేశారు. మైనార్టీ నాయకులు షేక్ హసేన్ పటేల్, మైనోద్దిన్, బుడ్డన్న, శ్రీను, తుల్జప్ప, కృష్ణ, ఇర్షాద్, ముస్తాఫ ఉన్నారు.

**రాజు కుటుంబానికి..**

బంట్వారం: కోట్‌పల్లి మండలంలోని ఎన్కెపల్లికి చెందిన చాకలి రాజు ఇటీవల ప్రమాదానికి గురయ్యాడు. ఈ క్రమంలో ఆ గ్రామ సర్పంచ్ భారతమ్మ గురువారం బాధితుడి ఇంటికి వెళ్లి పరామర్శించారు. కుటుంబ సభ్యులకు రూ.50వేలు ఆర్థిక సహాయం అందించారు. ప్రభాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**నర్సింహులు కుటుంబానికి..**

దోమ: మండల పరిధిలోని బొంపల్లి గ్రామానికి చెందిన అప్పగాళ్ల నర్సింహులు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఉమ్మడి రంగారెడ్డి జిల్లా డీసీసీబీ చైర్మన్ మనోహర్ రెడ్డి గ్రామానికి వెళ్లి బాధిత కుటుంబాన్ని పరామర్శించి రూ.5 వేల ఆర్థిక సహాయం అందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాల సంస్థ డైరెక్టర్ యాదయ్య గౌడ్, బీఆర్‌ఎస్ నేతలు పవన్‌యాదవ్, లోకేశ్ యాదవ్, ప్రవీణ్ యాదవ్, హైమద్, భాస్కర్, ఖదీర్, మహేశ్, సురేశ్ పాల్గొన్నారు.

# కార్మికులకు కంటి పరీక్షలు



కార్మికులకు నేత్ర పరీక్షలు చేస్తున్న వైద్యులు

మోమిన్‌పేట: మండల పరిధిలోని కంపెనీల్లో పని చేస్తున్న కార్మికులకు ఈఎస్‌ఐ సేవలు అందుబాటులో లేవని హోల్ట గ్రీన్ స్ట్రక్చర్ ప్రైవేట్ లిమిటెడ్ హెచ్ అర్ మేనేజర్ అర్ఎస్అర్ క్రిష్ణ అన్నారు. మండల పరిధిలోని మొరంగపల్లి సమీపంలోని కంపెనీలో గురువారం జాతీయ భద్రత వారోత్సవాలు నిర్వహించారు. అగర్వాల్స్ ఐ అస్పత్రి సౌజన్యంతో 250 మంది నేత్ర పరీక్షలు నిర్వహించారు. అంతకు ముందు కంపెనీ అవరణలో ప్లాంట్ ఆపరేషన్ వైస్ ప్రెసిడెంట్ జయరాజ్ మీనన్ మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో కంపెనీ వైస్ ప్రెసిడెంట్ వీవీ శ్రీధర్, సేఫ్టీ అధికారి శివ, కంపెనీ సిబ్బంది సుప్రియ, రాజేందర్‌రెడ్డి, మహేంద్ర తదితరులు పాల్గొన్నారు.

# వైభవంగా ఆరాధనోత్సవాలు

కొడంగల్ రూరల్: పట్టణంలోని శ్రీజగద్గురు నిరంజన మఠంలో గురువారం వీరశైవ లింగాయత్, లింగ బలిజ సంఘం సభ్యుల ఆధ్వర్యంలో శ్రీబసవలింగేశ్వర స్వామివారి ఆరాధనోత్సవాలను అత్యంత వైభవంగా భక్తిశ్రద్దలతో జరుపుకున్నారు. పెద్దఎత్తున భక్తులు హాజరయ్యారు. అంతకుముందు ఉదయం నూతన బసవేశ్వర స్వామివారి విగ్రహాన్ని పట్టణంలోని శ్రీమహాదేవుని ఆలయంలో ఊరేగింపుగా శ్రీనిరంజన మఠానికి తీసుకెళ్లారు. ఎంపీపీ ముద్దప్ప దేశ్‌ముఖ్, వీరశైలింగాయత్ సంఘం పట్టణ అధ్యక్షుడు బీఆర్.విజయకుమార్, బాలప్రకాష్, వీరసంఘప్ప, వీరశైవ లింగాయత్ సభ్యులు, మహిళలు పాల్గొంటూ స్వామివారికి మంగళహారతులు అందిస్తూ దర్శించుకున్నారు.

# చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి

**ఎస్‌కేఆర్ ట్రస్టు వ్యవస్థాపకుడు కొండల్‌రెడ్డి**



పీఎంఆర్ యువసేన జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న కొండల్‌రెడ్డి, రామేశ్వర్

మర్పల్లి: యువత చదువుతో పాటు క్రీడా రంగాలపై దృష్టి సారించాలని జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్, ఎస్‌కేఆర్ ట్రస్టు వ్యవస్థాపకుడు కొండల్‌రెడ్డి అన్నారు. సీఎం కేసీఆర్ జన్మదినం పురస్కరించుకొని ఎస్‌కేఆర్ ట్రస్టు ఆధ్వర్యంలో ఫిబ్రవరి 17 నుంచి మర్పల్లిలో నిర్వహిస్తున్న క్రికెట్ టోర్నమెంట్ గురువారం ముగిసింది. ఈ సందర్భంగా ఆయన బహుమతులు ప్రదానం చేశారు. ఈ పోటీల్లో 70 క్రికెట్ టీం జట్లు పాల్గొన్నాయి. మర్పల్లి గ్రామానికి చెందిన పీఎంఆర్ యువసేన జట్టు (జెడ్పీటీసీ మధుకర్ యువత జట్టు) విజేతగా నిలువగా.. రన్నరప్‌గా కల్‌ఖోడ క్రికెట్ జట్టు నిలిచింది. విన్నర్ టీంకు లక్ష నగదుతో పాటు ట్రోఫీ అందజేశారు. మ్యాన్ ఆఫ్ ది సిరీస్‌కు రూ.10 వేలు మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ రామేశ్వర్, సహకార సంఘం వైస్ చైర్మన్ ఫసీ, ఎంపీటీసీల ఫోరం మండల చైర్మన్ రవితో కలిసి ఆయన విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడాపోటీలలో గెలుపు ఓటములు సమానంగా స్వీకరించాలన్నారు. ఓటమి విజయానికి సోపానమని పేర్కొన్నారు. చదువుతో పాటు క్రీడల్లో రాణిస్తే మంచి భవిష్యత్ ఉంటుందన్నారు. వికారాబాద్‌లో తమ ఎస్‌కేఆర్ ట్రస్టు ఆధ్వర్యంలో మరో టోర్నమెంట్ నిర్వహిస్తానన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ రామేశ్వర్, నిర్వాహకులు నవీన్, నర్సింహారెడ్డి, నర్సాపూర్ తండా సర్పంచ్ ధరమ్‌సింగ్, బీఆర్‌ఎస్ శ్రేణులు బట్టు రమేశ్, రవీందర్‌రెడ్డి, పట్లూర్ రవి, రథన్, క్రీడాకారులు ఉన్నారు.